## వంద శాతం చెత్త సేకరణే లక్ష్యంగా.. పారిశుధ్య సిబ్బంది పని చేయాలి

### కమిషనర్ శరత్ చంద్ర



బండ్లగూడలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలను పంపిణీ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది.. పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఫిబ్రవరి 29: వంద శాతం చెత్త సేకరణ లక్ష్యంగా పారిశుధ్య సిబ్బంది పని చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు. ఆయన కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం పర్యటించి పారిశుధ్య సిబ్బంది పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెత్తను ఆరు బయట పడేయకుండా ఇంటింటికీ వచ్చే చేత్త సేకరణ ఆటో వారికి అందించాలి అని అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి అందించేందుకు గాను తడి, పొడి బుట్టలను ఇంటింటికీ అందించాలన్నారు. రోడ్లపై చెత్త చెదారం పేరుకు పోకుండా చూడాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

# ఐదేండ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో

### డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 29: ఐదేండ్ల లోపు పిల్లలకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన వెల్లడించారు. మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా గురువారం మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన హాజరై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన పిల్లల ఎదుగుదలకు, వారు ఆరోగ్యంగా ఉండేందుకు గాను తల్లిదండ్రులు తప్పకుండా వారికి పల్స్ పోలియో వేయించాలన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవపల్లి, నార్సింగి, నర్కుడ, పెద్ద షాపూర్, శేరి లింగంపల్లి పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. డివిజన్‌లో 0–5 సంవత్సరాలలోపు పిల్లలు మొత్తం 1,46,946 మంది ఉన్నారన్నారు. మార్చి 3వ తేదీన మొదటి రోజు బూత్‌లలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 4, 5వ తేదీలలో హౌజ్ టూ హౌజ్ సర్వే చేస్తారన్నారు. ప్రతి పీపీఈ బూత్‌లలో ఒక ఆషా, ఒక ఏఎన్ఎం, ఇద్దరు వాలంటీర్లు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేఖ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పద్మ, డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ వందన, డాక్టర్ స్వాతి, డివిజన్ నుంచి హెచ్ఈ, ఎస్‌యూవో, డీపీఎంవో, అన్ని పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్‌లో శిబిరాలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 29: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోలియో డే నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 0–5 ఏండ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్‌లలో పల్స్ పోలియో శిబిరాలు ఏర్పాటుచేయనున్నారు. యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో ఆయా కేంద్రాలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థానిక అపార్ట్‌మెంట్లలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు, అంగన్‌వాడీ సిబ్బందికి, ఆశా వర్కర్లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. కాగా, పోలియో చుక్కలు వేసుకోలేని పిల్లలను గుర్తించేందుకు మార్చి 4, 5, 6 తేదీలలో సర్వే నిర్వహించి క్షేత్రస్థాయిలో పోలియో చుక్కలు వేయనున్నారు.

## మంచినీటి సమస్యలను పరిష్కరించండి

### జల మండలి మేనేజర్‌ను కోరిన కౌన్సిలర్ శైలజ



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్ శైలజ, కాలనీ వాసులు

మణికొండ, ఫిబ్రవరి 29: ఎండా కాలం సరిగా రాకముందే ప్రజలకు మంచినీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మణికొండ మున్సిపాలిటీ 16వ కౌన్సిలర్ శైలజ అన్నారు. ఈ మేరకు మణికొండ మర్రిచెట్టు ప్రాంతంలోని హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ జల మండలి కార్యాలయంలో మేనేజర్‌ను గురువారం కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ మణికొండ క్వార్టర్స్ కాలనీలో మంచినీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా కావడం లేదని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఈ ప్రాంతంలో అధికంగా నివసిస్తున్నారన్నారు. మంచినీళ్లు రాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని జలమండలి మేనేజర్‌ను వినతిపత్రం ద్వారా కోరామని తెలిపారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పై అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో దివ్య జ్యోతి యువజన సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, అధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్(టింకు), అనిల్, మహేశ్వర్, మోహన్ కృష్ణ, శివకుమార్, శంకర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెటిల్మెంట్లలో.. బోరబండ పోలీసులు

### కాలయాపన చేస్తున్న పోలీసులు: బాధిత మహిళ



పోలీస్ స్టేషన్ ముందు మీడియాతో తన గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 29: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు నెలల క్రితం ఓ మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి 493, 420 కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, ఈ కేసులో ప్రమేయమున్న వారి కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయకుండా పోలీసులు వదిలేశారని సాయిక్రాంత్ అనే యువకుడి చేతిలో మోసపోయిన మహిళ ఆరోపించింది. బోరబండ ప్రాంతానికి చెందిన సదరు మహిళ సాయిక్రాంత్ తనను ప్రేమించానని నమ్మించి తనతో సహజీవనం చేసి తప్పించుకుని తిరుగుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏడాది గడిచినా పోలీసులు కేసు దర్యాప్తు చేయకుండా కాలయాపన చేస్తున్నారని గురువారం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగింది. సాయిక్రాంత్‌కు పోలీసులు సహకరిస్తున్నారని, బోరబండ పోలీసులు సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేసింది. బోరబండ మాజీ సీఐ రవి కుమార్, ప్రస్తుత ఎస్ఐ సర్దార్ జమాల్ సదరు వ్యక్తుల వద్ద లంచం తీసుకుని తమకు అన్యాయం చేస్తున్నారంటూ ఆరోపణలు చేసింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తగిన న్యాయం చేయాలని వేడుకుంది.

## జాతీయ సదస్సుకు తెలంగాణ వర్సిటీల ఉద్యోగులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 29: 'ప్రభుత్వ ప్రోత్సాహిత ఉన్నత విద్య – ప్రస్తుత పరిస్థితి – బాధ్యతలు' అనే అంశంపై మార్చి 1, 2వ తేదీల్లో జాతీయ సదస్సు జరగనుంది. అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల కాన్ఫెడరేషన్ (ఏఐయూఈసీ) ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయ ఉద్యోగుల తరపున డా. బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగ సంఘం నేత జి.మహేశ్వర్ గౌడ్ తెలిపారు. సదస్సును ఒరిస్సాలోని బాలాసోర్‌లో జరుగనున్నదని, ఓపెన్ వర్సిటీ ఉద్యోగ సంఘం నేత జి.మహేశ్వర్ గౌడ్, ఉస్మానియా వర్సిటీ తరపున బి.జ్ఞానేశ్వర్ ఇందులో పాల్గొననున్నట్టు పేర్కొన్నారు.






యూసుఫ్‌గూడ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్‌లో పర్యటిస్తున్న డీసీ వేణుగోపాల్ రెడ్డి

## పారిశుధ్య నిర్వహణ ప్రమాణాలు పెంచాలి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 29: పారిశుధ్య నిర్వహణలో ప్రమాణాలు పెంచాలని జీహెచ్ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ శేరి లింగంపల్లి డీసీ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను అధికారులతో గురువారం కలిసి ఆయా పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీ సేవా ఇస్లావత్, ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ సంతోష్, రాంకీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

## తుది దశలో రిజర్వాయర్ పనులు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 29: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని జల మండలి డివిజన్–6 జీఎం ఎస్.హరిశంకర్ పేర్కొన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో చేపడుతున్న రిజర్వాయర్ పనులను గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వాటిని త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గడల శ్రీనివాస్‌కు టికెట్ కేటాయించొద్దు

### ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 29: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసిన భద్రాద్రి కొత్తగూడెం గత హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాస్ రావుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత డైరెక్టర్ తన పదవీ కాలంలో డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లపై, కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులను దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. ఆయన కనుసన్నల్లోనే ప్రస్తుత అధికారిణి సైతం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారు చేసిన అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరిపించాలని, ఖమ్మం ఎంపీ టికెట్ స్థానం ఎట్టి పరిస్థితుల్లో కేటాయించొద్దని, ఆయనకు టికెట్ ఇస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనపాటి శ్రీనివాస్ మాదిగ, బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్కే ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 29: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పోరాటం చేయాలన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కోడ్ అమలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రావడంతో కోడ్ అమలులోకి వచ్చిందని శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. సభలు సమావేశాలు, ర్యాలీలు, మైకు అనుమతులు ఆయా జిల్లా కలెక్టర్‌ల నుంచి పొందాలన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చట్టం ముందు అందరూ సమానులే



సంజీవయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 29: భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేనని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం మారేడ్‌పల్లి సంజీవయ్య నగర్ కమ్యూనిటీ హాల్ లో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విదేశాల్లో వెళ్లి చదువుకోవడానికి అంబేద్కర్ విద్యానిధి పథకం కింద 20 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి ఆర్ఐ సర్వేష్, వార్డెన్ జాలలోద్దిన్, బస్తీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి

### తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ యాదవ్



ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29: తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా అశోక్ యాదవ్ ఎన్నికయ్యారు. ఆయన కొన్నేళ్లుగా ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతర సైనికుడిలా పోరాటం చేస్తానన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలు, జిల్లాలు, మండల స్థాయి నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని తక్షణమే ప్రకటిస్తూ, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో జరుగుతున్న ఆర్థిక దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వడ్డె గణేశ్, ఉపాధ్యక్షుడిగా సైదులు, అధికార ప్రతినిధిగా సురేశ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా భగత్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శిగా వడ్డెపల్లి సందీప్, కోశాధికారిగా దండేపల్లి నవీన్, కార్యవర్గ సభ్యులుగా రాజ్‌కుమార్, మహేశ్, ఓయూ ఇన్‌చార్జిగా మధుయాదవ్, కార్యదర్శిగా కేలోత్ కిరణ్ ఎన్నికయ్యారు.

# పాత బకాయిల వడ్డీపై 90 శాతం తగ్గింపు..

### నేటినుంచి ఆస్తిపన్ను స్పెషల్ డ్రైవ్..



యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఆస్తిపన్ను ఆఫర్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీ సేవా ఇస్లావత్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 29: ఆస్తిపన్నుకు 2022–23 వరకు ఉన్న పాత బకాయిలపై 90 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అధికారులు, ప్రత్యేక బృందాలతో గురువారం సమావేశం నిర్వహించారు. నగర పాలక సంస్థ ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై 90 శాతం రిబేటు ప్రకటించినట్లు, మార్చి 31 వరకు పాత బకాయిలు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాగా, లక్షలాది రూపాయలు బకాయిలున్న వారికి వడ్డీపై 90 శాతం మాఫీ పథకం సువర్ణ అవకాశంగా మారనుంది. పాత బకాయిలు పూర్తిగా చెల్లించే వారిపై అదనపు భారం పడకుండా వడ్డీపై 90 శాతం తగ్గింపు ఆఫర్‌తో వంద శాతం ఆస్తిపన్ను వసూలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నేటి నుంచి జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు ఆస్తి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసీ కమల్, ఇన్‌చార్జ్ ఏఎంసీ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

### అపరాధ రుసుముతో చెల్లించండి



రాజేంద్రనగర్ డీసీ రవి కుమార్

బండ్లగూడ, ఫిబ్రవరి 29: పది శాతం అపరాధ రుసుంతో ఆస్తి పన్నుదారులు తమ ఆస్తి పన్నును చెలించాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో నం.101 ప్రకారం, ఇప్పటి వరకు ఉన్న అపరాధ రుసుమును 90 శాతం మాఫీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వెంటనే ఆస్తి పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పది శాతం అపరాధ రుసుముతో ఆస్తి పన్నును చెల్లించాలన్నారు.

### ఆస్తి పన్ను వసూలులో వేగం పెంచండి



బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బందితో సమావేశమైన కమిషనర్ శరత్ చంద్ర

ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతుండటంతో ఆస్తి పన్ను వసూలులో మరింత వేగం పెంచవలసిన అవసరం ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర బిల్ కలెక్టర్లును ఆదేశించారు. ఆయన కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో పాటు వివిధ విభాగాల సిబ్బందితో గురవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్తి పన్ను చెలించని వారికి నోటీసులు అందజేయాలని ఆయన బిల్ కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలనుసారంగా 10శాతం అపరాధ రుసుముతో ఆస్తి పన్ను చెలించవచ్చని వారికి తెలియజేయాలన్నారు.

### ఆస్తి పన్ను వసూలుకు వన్ టైమ్ స్కీమ్

మణికొండ, ఫిబ్రవరి 29: ఆస్తిపన్ను వసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా అపరాధ రుసుము మాఫీ చేస్తూ పన్నును స్వీకరిస్తున్నట్లు మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో నం.101 ద్వారా ఆస్తి పన్ను పేరుకుపోయిన బకాయి అపరాధ రుసుము 90 శాతం మాఫీతో కేవలం 10 శాతం అపరాధ రుసు ము మాత్రమే చెల్లించేందుకు చివరి అవకాశం కల్పించిందన్నారు. మణికొండ పట్టణంలో ఆస్తిపన్ను చెల్లింపుదారులు పన్ను చెల్లించేందుకు ప్రోత్సహించడానికి వన్ టైమ్ స్కీ మ్ కింద బకాయి ఉన్న వారికి 90 శాతం అపరాధ రుసుము మాఫీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. వినియోగదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి మణికొండపట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## మెగా డీఎస్సీలో పీఈటీ పోస్టులను పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29: రాష్ట్రప్రభుత్వం అట్టాహాసంగా ప్రకటించిన మెగా డీఎస్సీలో పీఈటీ పోస్టులను తక్కువగా చూపించడాన్ని స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి రాజేశ్ తప్పుబట్టారు. తక్షణమే పీఈటీ పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్లో ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వ్యాయామ నిరుద్యోగ, విద్యార్థుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఈటీ పోస్టులు 1600 ఉండగా కేవలం 182 పోస్టులను మాత్రమే నోటిఫికేషన్‌లో పేర్కొనడం బాధాకరమన్నారు.

- నిరుద్యోగులను పట్టించుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.
- తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్‌ను సవరించి, నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని కోరారు.
- మేనిఫెస్టోలో పేర్కొన్న హామీనే అమలు చేయమంటున్నామని చెప్పారు.
- డీఎస్సీలో పీఈటీ పోస్టులను పెంచకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. సత్య నారాయణ, ప్రొఫెసర్ దీప్లా, మల్లికార్జున్, ఎస్ఎస్ఎఫ్ నాయకులు గుండు నాగయ్య, చాలికంటి వినోద్‌కుమార్, మహేందర్, సైదులుగౌడ్, గణేశ్, ఉంద్రాతి లెనిన్, మనుశ్రీ పాల్గొన్నారు.

# వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- ట్రాఫిక్ సిబ్బంది కుటుంబ సభ్యులకు హెల్మెట్‌ల పంపిణీ
- హైదరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ సుబ్బారాయుడు




సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ ట్రాఫిక్–1 డీసీపీ సుబ్బారాయుడు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 29: ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా ఉండవచ్చని హైదరాబాద్ ట్రాఫిక్–1 డీసీపీ సుబ్బారాయుడు అన్నారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం నార్త్‌జోన్ ట్రాఫిక్, సిటీ ట్రాఫిక్ సిబ్బంది ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పీజీ కళాశాల అడిటోరియంలో రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ట్రాఫిక్ సిబ్బందితో పాటు వారి పిల్లలకు ఉచితంగా హెల్మెట్‌లను ట్రాఫిక్–1 డీసీపీ సుబ్బారాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువగా యువత ఓవర్ స్పీడ్ , రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం రైడర్, పిలియన్ రైడర్ తప్పనిసరి హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనం ముందు కూర్చున్న వ్యక్తి ప్రాణాలు ఎంత ముఖ్యమో వెనుక కూర్చున్న వ్యక్తి ప్రాణాలు కూడా అంతే ముఖ్యమని తెలిపారు. హెల్మెట్ మీ ప్రాణాలను కాపాడే ఆయుధమన్నారు. సెల్ ఫోన్ పగలకుండ స్క్రీన్ గార్డ్, పౌచ్‌లు వేయిస్తాం కానీ బైక్ నడిపేటప్పుడు మాత్రం తల పగలకుండ హెల్మెట్ ధరించమని, సెల్‌ఫోన్‌కు ఉన్న విలువ కూడా మన తలకు లేదా అని వ్యాఖ్యానించారు.2023 నాటికి సిటీలో దాదాపు 56.9 లక్షల బైక్‌లు ఉన్నాయని, అందులో 18 లక్షల మందికి పైగా హెల్మెట్ ధరించ లేదని తెలిపారు. హెల్మెట్ లేని ప్రయాణం నేరమని, ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.1,200 వరకు జరిమానా విధించడతో పాటు మూడు నెలలు లైసెన్స్ సస్పెండ్ అవుతుందన్నారు. అనంతరం హెల్మెట్‌లు ధరించి ట్రాఫిక్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రంగారావు, నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్లు, టీటీఐ బేగంపేట ఇన్‌స్పెక్టర్ రాంచందర్‌తో పాటు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ మృదుల తదితరులు పాల్గొన్నారు.